
## అడల్ట్స్ ఓన్లీ కథ A

# ట్రీట్‌మెంట్

**కె.కె. భాగ్యశ్రీ**

చేతిలో మల్లెపూల పొట్లంతో, ఇంటిగేటు తీయబోతూ ప్రక్కింటి కుర్రాడు కనబడ్డంతో ఆగిపోయి ''సుమంత్...వన్ డే పోటీలో ఎవరు గెలిచారు'' అడిగాడు శేఖర్ ఎంతో ఉత్కంఠగా.



అప్పటికే అతడి నుదుటన చిరుచెమటలు అలుముకున్నాయి.

''బ్యాడ్‌లక్ అంకుల్! ఆస్ట్రేలియానే గెలిచింది. అస్సలు చాలా బాగా ఆడారండీ మనవాళ్లు! లక్ష్మణ్, యువరాజ్ సెంచరీలు కూడా చేశారు. అయినా ఫలితం దక్కలేదు. లాస్ట్ ఓవర్లో 'బ్రెట్ లీ' సిక్సర్ కొట్టడంతో ఆస్ట్రేలియా గెలిచింది'' శేఖర్‌కి కావలసిన సమాచారమంతా క్షణాల్లో అందించేసి తన పనైపోయిందన్నట్లుగా వెళ్లిపోయాడు సుమంత్.

హతవిధీ..ఇండియా గెలవాలని, ఇంటి వాతావరణం తనకనుకూలంగా మారాలనీ ముక్కోటి దేవతలను ప్రార్థించుకుంటూ వస్తున్నాడు. కానీ ఆ దేవుడు తన మొర వినలేదు.

తన పట్ల జాలిలేని ఆ భగవంతుడు ప్రతికూల పవనాలు వీచేలా చేశాడు!

'భగవాన్ నువ్వెంత నిర్దయుడివి!' బావురుమన్నాడు శేఖర్ తనలో తానే.

లోపలికి ప్రవేశించిన అతడికి-హాల్లో సోఫాలో కూర్చుని దిగులుగా ఎటో చూస్తున్న శ్రీహిత కనిపించింది. ఆమె ముఖం మ్లానమై, వాడిన మందారంలా ఉంది. ఆమె చాలాసేపయి ఏడుస్తున్న దానికి సూచనగా కన్నులు ఎర్రబారి ఉన్నాయి. శేఖర్ గుండె జారిపోయింది ఆమెనా ఫోజులో చూడగానే.

''శ్రీలూ..'' మల్లెపూల పొట్లాన్ని ఆమె ఒడిలో ఉంచుతూ ముద్దుగా పిలిచాడు.

అతడి వైపు ఓసారి చూసి ''చూడండి ఎంత పనైందో..ఆఖరి నిముషంలో అంతా తారుమారయ్యింది..నా మనసేం బాగులేదు..నన్ను మాట్లాడించకం డి'' అంది శ్రీహిత భారంగా.

ఇంక తనెన్ని ప్రయత్నాలు చేసినా ఆమె ఆ మూడ్ నుండి బయటకు రాదని గ్రహించిన శేఖర్ మాట్లాడకుండా వెళ్లి స్నానం చేసొచ్చాడు.

వంటింట్లోకి వెళ్లి కాఫీ కలుపుకొచ్చాడు. ప్రొద్దుట్నుంచీ ఆమె వంట ప్రయత్నమే చేయనట్లుగా అనిపిస్తోంది అక్కడి వాతావరణం.

కాఫీ త్రాగడం పూర్తి చేసి 'ఏ పాటు తప్పినా సాపాటు తప్పదు గదా!' అనుకుంటూ బియ్యం కడిగి కుక్కర్‌లో పెట్టాడు. బంగాళదుంపలు కోసి మూకుట్లో వేసి ఎర్రగా వేయించి కారం జల్లాడు. ములక్కాడలు వేసి పల్చగా సాంబారు చేశాడు.

పెళ్లికి ముందు అతడు కూడా మెస్‌లో తిని గడుపుకొనేవాడు అందరు బ్రహ్మచారుల్లా. ఈ పాకశాస్త్ర ప్రావీణ్యమంతా..అతడికి శ్రీహితతో వివాహానంతరం పట్టుబడిందే.

వండి, వడ్డించడంలో సాక్షాత్తూ కాశీ అన్నపూర్ణే ఆమె.

కానీ ఎటొచ్చీ ఆమె మూడ్ బాగుంటేనే ఆ అవతారం ఎత్తుతుంది మరి!

## అసలుసంగతి

ఒక్కోసారి మన అలవాట్లు అవకాశాలపై ప్రభావం చూపిస్తాయి. అదెలాగో బొద్దుగుమ్మ ఆర్తీఅగర్వాల్‌ని అడిగి తెలుసుకుందాం. 'నేనీమధ్య బాగా లావుగా తయారయ్యాను. నేను స్లిమ్‌గా తయారవ్వాలంటే నా శరీరం సహకరించడం లేదు. తిండి తగ్గిస్తే నీరసం వస్తోంది. తగ్గించకపోతే అవకాశాలు లేక ఖాళీగా ఉండాల్సి వస్తోంది. ఏదో వ్యాపకం ఉంటే తిండి ధ్యాస ఉండదు' అంటోంది. ఆమె తన భారీకాయాన్ని తగ్గించుకోకుంటే తెరమరుగయ్యే అవకాశాలెక్కువ అని ఆమె సన్నిహితులు వ్యాఖ్యానిస్తున్నారు.

లేకుంటే నో వంట..నో తిండి.

పస్తులే పస్తులు!

అటువంటి విపత్కర పరిస్థితుల్లోనే అలవడింది శేఖర్‌కి ఈ విద్య.

ఇంతకీ శ్రీహిత మూడ్ అప్పుడప్పుడు ఎందుకు ఆఫ్ అవుతుందో తెలుసుకున్న ఎవరైనా సరే ముక్కు మీద వేలేసుకోవలసిందే!

శ్రీహితకి క్రికెట్టంటే విపరీతమైన పిచ్చి.

ఆమెకీ ఆట పట్ల ఆసక్తి, అభిరుచి ఉన్నాయని తెలుసుకున్న తొలిరోజుల్లో శేఖర్ పొంగిపోయాడు తన ఇష్టాన్ని అభిమానించే అర్ధాంగి దొరికిందని.

కానీ ఆ మురిపెం ఎన్నాళ్లో నిలవలేదు. క్రికెట్ క్రీడ పట్ల శ్రీహితకున్న అభిమానం అసామాన్యం అని..తమ జీవితంలోని ఆనంద విషాదాలన్నీ దాన్తోనే ముడివడి ఉన్నాయని ఆ తరువాత అర్థమైంది శేఖర్‌కి.

ఈ విషయంలో శ్రీహితది అతి ధోరణి. టి.వి.లో ఏ క్రికెట్ మ్యాచ్ వచ్చినా సరే.. ఇంట్లో అన్ని పనులు ఆపేసుకుని మరీ టీవీ ముందు బైఠాయిస్తుంది.

మధ్యలో కరెంట్‌గాని పోయిందంటే.. ఇక అంతే సంగతులు.

కరెంట్ ఆఫీసులో పనిచేస్తున్న ప్యూన్‌ని మొదలుకొని..విద్యుత్‌శాఖామంత్రి దాకా అందరినీ యధాశక్తి తిట్టిపోస్తుంది.

తాను ఏం చేసినా ఆమె ప్రవృత్తిలో మార్పు తేలేనని గ్రహించిన శేఖర్ చేసేందుకేం లేక తనే చేయి కాల్చుకోవడం మొదలుపెట్టాడు.

అదే అతని పట్ల శ్రీరామరక్ష అయ్యింది నేడు.

పోనీ..ఆట పట్ల ఆమెకున్న ఇంట్రస్ట్ ఆటకే పరిమితమైతే బాగుండిపోదును. కానీ ఆ ప్రభావం ఆట ముగిసిన తరువాత కూడా ఆమెని విడిచిపెట్టదు.

విధి వశాత్తూ ఇండియా టీము ఓడిపోతే ఆమె దుఃఖానికంతు ఉండదు. ఇంట్లో వంట కూడా చేయడం మానేసి విషాదంగా కూర్చుంటుంది. పదే పదే భారత జట్టు వైఫల్యం చెందడానికి గల కారణాలని వెతికి మరీ విశ్లేషిస్తుంది. క్రికెట్ అంటే ఎంత ఇష్టం ఉన్నా సరే..అస్తమానం అదే వినడం చికాగ్గా అనిపిస్తుంది శేఖర్‌కి.



కేవలం వంట చేయడం మానేయడమే కాదు పడకటింట్లో కూడా పస్తులుంచుతుంది దారుణంగా.

ఇదే..ఇదే..అతడికి అత్యంత దుర్భరంగా మారింది.

మొదట్లో అందరు భార్యల్లాగే మామూలుగానే భర్తకిష్టమయ్యే రీతిలో నడుచుకునేది శ్రీహిత.

వరల్డ్‌కప్ ఫైనల్లో ఇండియా ఘోరంగా ఓడిపోవడంతో ఆమె విచారానికంతే లేకుండా పోయింది.

శేఖర్ కర్మకాలి..ఆరోజే వారి మొదటి వివాహ వార్షికోత్సవం పడింది. ఆఫీస్‌కి సెలవు పెట్టే అవసరం కూడా ఏర్పడలేదు శేఖర్‌కి ఆరోజు ఆదివారం కావడంతో.

''ఈరోజు మన మ్యారేజ్ డే కదా..ఏదన్నా సినిమాకి వెళ్లి, హోటల్లో భోంచేసి వద్దామా శ్రీలూ'' అడిగాడు శేఖర్ ప్రేమగా.

''సినిమా గినిమా ఏం లేదు? ఇవాళ వరల్డ్ కప్ ఫైనల్స్..నేనెటూ రాను. అసలే టెన్షన్‌తో నరాలు తెగేట్లున్నాయి'' నిక్కచ్చిగా చెప్పేసింది శ్రీహిత.

సరే..అందులోనే ఆమెకి ఆనందం లభిస్తుందంటే అంతకన్నా తనకింకేం కావాలి అనుకుని ఆమెని ఒత్తిడి చేయలేదతడు. హోటల్ నుండి స్పెషల్ మీల్స్ తెప్పించాడు. బెడ్‌రూమ్ అంతా తనే అందంగా అలంకరించాడు మల్లెలు గులాబీలతో. రూమ్ అంతా రూమ్ ఫ్రెషనర్ స్ప్రేచేసి పరిమళాలు వెదజల్లే అగరొత్తులు వెలిగించాడు.

మూడు వందల యాభై తొమ్మిది పరుగుల విజయ లక్ష్యాన్ని ఛేదించలేక రెండు వందల ముప్పై నాలుగు పరుగులకే ఆల్ అవుట్ అయ్యి..కప్‌ని ఆస్ట్రేలియన్లకి అప్పజెప్పేసింది భారత్.

అంతే! ఒక్కసారిగా కళ్లనీళ్ల పర్యంతమైంది శ్రీహిత. టాస్ గెలిచినా సరే..ఫస్ట్ బ్యాటింగ్ చేసే సదవకాశాన్ని వినియోగించుకోకుండా ఫస్ట్ బౌలింగ్ ఎంచుకున్న గంగూలీని..అభిమానుల ఆశల్ని నిరాశలు చేస్తూ నాలుగో, ఐదో పరుగులు చేసి నిష్క్రమించిన 'సచిన్ టెండూల్కర్'నీ..అందరినీ తూర్పారబట్టింది.

ఆమె కసి అక్కడితో తీరిపోలేదు. ఎంతో

డబ్బు వెచ్చించి స్టార్ హోటల్ నుండి శేఖర్ తెప్పించిన 'స్పెషల్ మీల్స్'ని ఒక్క మెతుకైనా ముట్టుకోలేదు. స్నానం చేసి కొత్త చీర కూడా కట్టుకోకుండా కటికనేల మీద వాలిపోయింది కుమిలిపోతూ.

శేఖర్ ఆమెను అనునయించచూశాడు. ఏ ఆటలోనైనా గెలుపు-ఓటములు సహజమని, ఒకరు గెలిస్తే మరొకరు పరాజయం పాలవక తప్పదని..ఎన్నో విధాలుగా నచ్చచెప్పి చూశాడు. శ్రీహిత అవేం చెవికెక్కించుకోలేదు.

మొదటి 'మ్యారేజ్ డే'ను ఎంతో వైభవోపేతంగా జరుపుకోవాలని ఆశించిన శేఖర్ కలలు కల్లలయ్యాయి భార్యామణి 'సహాయ నిరాకరణోద్యమంతో'.

అల్లుకుపోయిన వారి తనువుల క్రింద నలిగిపోయి 'జన్మసార్థకం' చేసుకోవాలని ఆశగా ఎదురుచూసిన గులాబీలు, మల్లెలు..ఆ భాగ్యం దక్కకపోయేసరికి డీలాపడి ముఖాలు వ్రేలాడేశాయి. వారి సమాగమాన్ని కళ్లారా చూసి ఆనందించాలని తపించి..సుగంధాలు వెదజల్లిన అగరొత్తులు..అంతటి అదృష్టం తమకు లేదని తెలుసుకుని ఆరిపోయాయి తుస్సుమని.

వీటన్నింటికన్నా ఘోరంగా వుంది శేఖర్ పరిస్థితి.

'ఇదేం వింత వెర్రి నాయనా! ఈ జన్మంతా తన బ్రతుకింతేనా' బాధగా తల పట్టుకున్నాడు.

పోటీలో భారత్ ఓడిపోతే ఎంతగా కృంగిపోతుందో..గెలుపుకాని సంభవిస్తే అంతగా పొంగిపోతుంది. ఆ ఆనందం అంతా భర్తతో పంచుకొని అతడిని సమస్త సుఖాల్లో తేలియాడిస్తుంది.

ఆమధ్య 'టి.వి.ఎస్.కప్' వన్ డే సిరీస్ల్లో..ఒక వన్ డే మ్యాచ్‌లో ఆస్ట్రేలియా మీదగెలుపు సాధించింది భారత్. అంతే ఆ రోజు ఇంట్లో పండుగ వాతావరణం నెలకొంది.

రుచికరంగా వంట చేసి పెట్టి..అంతకన్నా అమృత తుల్యమైన అనుభూతుల్ని చవి చూపించింది శ్రీహిత.

అప్పుడే కాదు ఆ తరువాత హైదరాబాద్ ఎల్.బి. స్టేడియంలో న్యూజిలాండ్‌పై మన వాళ్లు సాధించిన ఘన విజయంతో ఉబ్బితబ్బిబ్బయిపోయి ఆ స్వర్గాన్నే క్రిందికి దింపేసిందారోజు.

ఈమధ్య ఆస్ట్రేలియాలో జరిగిన టెస్ట్ సిరీస్‌లో అడిలైడ్‌లో జరిగిన మ్యాచ్‌లో భారత్ అవలీలగా గెలుపు చేజిక్కించుకున్ననాడూ...

'వి.బి.సిరీస్' వన్ డేలో లీగ్ మ్యాచ్‌లో భారత్ గెలిచిన నాడూ ఇదే వరుస.

అద్భుతంగా బ్యాటింగ్ చేసి నూట మూడు పరుగులతో నాటౌట్‌గా నిలిచిన లక్ష్మణ్‌ను చూసి ''చూశారా మా హైదరాబాదీ ప్రతాపం? ఎంతైనా లక్ష్మణంటే లక్ష్మణే..'' అంది శ్రీహిత పరవశించిపోతూ.

శ్రీహిత కూడా హైదరాబాద్ అమ్మాయే మరి!

ఇప్పుడు..గెలుపు అంచుల్లోకి వచ్చి ఓటమిపాలైన భారత్‌ని తలుచుకొని ఇలా బాధపడుతోంది.

'అతివృష్టి..అనావృష్టి అంటే ఇదే కాబోలు! అంతా తన ఖర్మ' భారమైన మనసుతో నిద్రలేని మరో రాత్రిని ఎదుర్కొన్నాడు శేఖర్.

★ ★ ★

ఆరోజు భారత్ ఓడిందని అంత నిరుత్సాహం ప్రదర్శించిన శ్రీహిత..మరో రెండ్రోజుల తరువాత జింబాబ్వే మీద భారత్ ఆఖరిక్షణంలో గెలుపు సాధించడంతో ఆనందంతో క్రింద, మీద అయ్యింది.

''క్రిందటి మ్యాచ్ లాగానే మూడు బంతులు..ఏడు పరుగులు. అప్పుడు బ్రెట్ లీ సిక్సర్ కొట్టాడు కాబట్టి వారు గెలిచారు. ఇప్పుడు వీళ్ల పప్పులు ఉడకనివ్వలేదు మన వాళ్లు. మా హైదరాబాద్ అబ్బాయి బాగా ఆడబట్టే ఈ మ్యాచ్ గెలిచారు. వన్ డేల్లో తన టాప్ స్కోర్ నూట ముప్పై ఒకటికి చేరుకోవడంతో పాటు, ముఖ్యమైన క్యాచ్‌లు పట్టి జట్టుని విజయపథంలో నడిపించాడు'' అంది టి.వి.లో న్యూస్ చదివే న్యూస్ రీడర్‌లా మెరిసే కళ్లతో.

ఏడవలేక నవ్వాడు శేఖర్.


క్రికెట్‌లోని జయాపజయాలను..పర్సనల్ జీవితానికి ముడిపెట్టి తనతో 'బంతాట' ఆడుకుంటున్న ఆమెవైపు కసిగా చూశాడు శేఖర్.

'స్వామీ.. తిరుపతి వెంకన్నా..మా ఆవిడకీ పిచ్చిపోయేటట్లు చేసి..నా సంసార జీవితాన్ని గాడిలో పడేశావంటే..నీ కొండకొచ్చి గుండు కొట్టించుకుంటాను' మనసులోనే మొక్కుకున్నాడు శేఖర్ తుమ్మెదరెక్కల్లాంటి..తన నల్లని ఉంగరాల జుట్టుని మాసుకుంటూ.

ఆ తరువాత..అదే సిరీస్‌లో 'బెస్ట్ ఆఫ్ త్రీ' ఫైనల్స్ రెండింటిలో పేలవమైన ఆట తీరుని ప్రద

## విలక్షణత

**నిర్మాత, దర్శకుడు రాంగోపాల్‌వర్మ చిత్రాలంటే అందరికీ ఆసక్తే. తాజాగా 'మధ్యాహ్నం హత్య'తో వివాదాస్పదుడైన వర్మ తాజాగా 'మర్రిచెట్టు' పేరుతో ఓ హారర్ సినిమా నిర్మిస్తున్నారు. సహారా మనోరంజన్, సెరాసెరా ఈ చిత్రానికి నిర్మాతలు. అన్నట్టు ఈ చిత్రంలో జె.డి.చక్రవర్తి, సుస్మితాసేన్ హీరో హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. మునుపటి హారర్ చిత్రాల్లాగే ఈ సినిమా కూడా ఏ సంచలనం సృష్టిస్తుందో చూడాలి మరి.**



ర్శించిన భారత్‌ని చిత్తుగా ఓడించి సిరీస్‌ని కైవసం చేసుకున్న ఆస్ట్రేలియాని చూసి అపజయం పొంది పరాభవం పాలైన భారత్‌ని తలుచుకుని కుమిలికుమిలి ఏడ్చింది శ్రీహిత.

చిరాగ్గా నెత్తి బాదుకోవడం మినహా మరేమీ చేయలేకపోయాడు శేఖర్. లాభం లేదు. ఈ వైఖరి ఇలా కొనసాగితే తనకి పిచ్చెక్కడం ఖాయం. ఆ స్థితి రాకముందే తను మేలుకోవాలి..కానీ..ఎలా?

బుర్ర పగలకొట్టుకుని మరీ ఆలోచించాడు శేఖర్.

★ ★ ★

మరో నెలరోజులకి శ్రీహిత పుట్టిన రోజు రానే వచ్చింది. సిరీస్‌ని కోల్పోయిన భారత్‌ని తలుచుకుని ఖేదించిన శ్రీహిత ఆరోజుకి కాస్త కుదుటపడింది.

శేఖర్ ఆఫీసు నుండి వచ్చేసరికి ఏవో స్పెషల్ వంటకాలు చేసి అతడిని సంతోషపెట్టాలనుకుంది. ఇంట్లో చూస్తే..సరుకులు అన్నీ నిండుకున్నాయి.

'పాపం! తన క్రికెట్ గోలలో పడి అన్ని విధాలుగా ఆయన్ను బాధపెడుతోంది. కానీ ఏం చేయగలదు? క్రికెట్ అంటే తనకు ఆరోప్రాణం..తన ప్రమేయం లేకుండానే తన మనసు దాని పట్ల ఆసక్తురావుతుంది. దాన్ని మళ్లించుకొనే మార్గం తనకు చేత కావడం లేదు. దానికి అతడు బలైపోతున్నాడు' గాఢంగా నిట్టూర్చింది శ్రీహిత.

తన పుట్టిన రోజుని ఆయన మంచి గిఫ్ట్ తీసుకొస్తాడు. అది చీరైనా కావచ్చు నగైనా కావచ్చు..తన మీద అతడికున్న ప్రేమ అటువంటిది.

అందుకే- అతడికిష్టమైన పదార్థాలు వండి, వడ్డించి, అతడిని ఆనందసముద్రంలో ముంచెత్తాలి.

శ్రీహిత వెంటనే బజారుకు వెళ్లి కావలసిన సరుకులు, కూరగాయలు అన్నీ తెచ్చింది. వాటితోపాటు మల్లెలు కూడా తీసుకురావడం మరువలేదు.

పులిహోర, గులాబ్ జాం, పెరుగ్గారెలు చేసింది. బెడ్‌రూమ్‌ని చక్కగా అలంకరించింది. పానుపునిండా మల్లెలు పరిచింది..అత్తరు పూతలు..అగరు పొగలూ..షరా మామూలే..

స్నానం చేసొచ్చి శేఖర్‌కిష్టమైన లెమన్ ఎల్లో కలర్ చీర కట్టుకుంది. అతడికి ఆ కలరంటే ప్రాణం. శ్రీహిత వార్డ్‌రోబ్ నిండా ఆ కలర్ చీరలు, చుడీదార్‌లు ఎన్నున్నాయో చెప్పడం కష్టం. అందుకే..ఈరోజు కూడా అదే కలర్ కొత్త చీర కట్టుకుంది.

లేత పసుపురంగులో ఉన్న ఆమె శరీర వర్ణంలో కలిసిపోతూ..సుతిమెత్తని ఆమె ఒంపుసొంపుల్లో ఒదిగిపోతోంది ఆ పసుపురంగు చీర. నడుం వరకు ఉన్న ఒత్తైన ఉంగరాల జడలోంచి సన్నజాజుల దండ వ్రేలాడుతోంది. చెవులకు ఉన్న లోలకుల్లో పొదిగిన తెల్లని అమెరికన్ డైమండ్స్ కాంతులు..ఆమె పసిడి చెక్కిళ్లపై పడి పరావర్తనం చెందుతున్నాయి. సంధ్యా సుందరిలా ఎంతో మనోజ్ఞంగా ఉంది శ్రీహిత.

శేఖర్ రాకకోసం నిరీక్షిస్తూ..వీధిగుమ్మంలో నిలబడింది.

అతడు రానే వచ్చాడు. స్కూటర్ కాంపౌండ్‌లో పార్క్ చేసి లోపలికి నడిచాడు ముభావంగా.

రోజూ..తను ఏ మూడ్‌లో వున్నా పక్కపక్కనే తిరుగుతూ..తన క్రీగంటి చూపుకోసం పరితపించే భర్త ఆరోజు తనే ఎదురుగా వెళ్లినా సరే పట్టించుకోకుండా లోపలికి వెళ్లిపోవడం ఆమెకు ఆశ్చర్యం అనిపించింది.

లోపలికి వెళ్లి సోఫాలో నిస్త్రాణంగా కూలబడ్డాడు శేఖర్.

అతడి దగ్గరగా వెళ్లి నుదుటి మీద చేయి వేసి చూస్తూ ''ఏం అలా ఉన్నారు? ఒంట్లో బాగు లేదా?'' అని అడిగింది శ్రీహిత.

''ఒంట్లో బాగానే ఉంది..కానీ మనసే బాగోలేదు''

''ఏం ఏమైంది?''

మాట్లాడకుండా తన చేతిలోని వార పత్రిక టీపాయ్ మీద పడేశాడు.

అందులో ఏముంది? ఆసక్తిగా తెరిచింది. ఆమెకేం అర్థమవలేదు.

''ఏమైందో చెప్పమంటే పుస్తకం ముందు పడేస్తారేంటీ?'' అసహనంగా అడిగింది శ్రీహిత.

'నీకేమీ తెలియదు' అన్నట్టుగా ఆమెనో చూపు చూసి ''ఆమధ్య ఈ వీక్లీ వాళ్లు సీరియల్స్ పోటీ పెట్టారు కదా! అందులో నా అభి

## అనిత ఆశ

**తమిళంలో హిట్ అయిన చిత్రాన్ని తెలుగులో నిర్మించి హిట్ కొట్టాలనుకుంటారు సినీజనం. ఇప్పుడు తమిళ చిత్రం 'సమురాయ్'ని తెలుగులో నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో అనిత, విక్రమన్ నటిస్తున్నారు. ఈ సినిమాకి సంగీతం ప్రధానం అని అంతా అంటున్నారు. అనితకి ఈ చిత్రం కాస్తంత కాలక్షేపం ఇచ్చినట్టుంది. ఈ సినిమా హిట్ అయి మరికొన్ని అవకాశాలొస్తే గానీ అనిత కుదుటపడేటట్లు కన్పించడం లేదు.**



మాన రచయితకే ఫస్టు ప్రైజు వస్తుందనుకున్నాను. కనీసం కన్సొలేషన్ అయినా రాలేదు. అందుకే నా మనసంతా చికాగ్గా వుంది'' అన్నాడు శేఖర్ విచారంగా.

''ఇందులో మనసు పాడు చేసుకోవడానికే ముంది? అతడు రాసిన సబ్జెక్ట్ ఆ పత్రిక వారికి నచ్చి ఉండకపోవచ్చు. అందుకనే బహుమతి ఇవ్వలేదేమో!'' సులువుగా తేల్చి చెప్పేసింది శ్రీహిత.

''నువ్వెన్ని చెప్పు.. ఆ రచయిత తన అభిమానులందరినీ నిరాశ పరిచాడు'' అన్నాడు శేఖర్ వాడిపోయిన వదనంతో.

శ్రీహిత అతడి మూడ్ మార్చాలన్న ఉద్దేశ్యంతో ''ఈరోజు నా పుట్టినరోజు'' అంది మెల్లగా అతడికి గుర్తు చేస్తూ.

''అయితే?'' విసుగ్గా అన్నాడు అతడు.

మౌనంగా పెదవి కొరుక్కుంది శ్రీహిత. తనకు 'బర్త్‌డే గిఫ్టు' తెచ్చి సర్‌ప్రైజ్ చేస్తాడని ఊహిస్తే ఇలా చేశాడేంటి? తన పుట్టిన రోజని చెప్పినా కూడా అతడు ఏమాత్రం ఇంట్రెస్ట్ చూపించలేదు.

అంతలోనే ఆమెకు ఓ విషయం స్ఫురించింది. ఆమధ్య క్రికెట్ మ్యాచ్‌లు జరిగినన్నాళ్లూ తను అతడిని ఇలాగే నిరాశపరిచింది. దానికి ఇది ప్రతీకారం కాదు కదా! ఏమో అయినా అయ్యుండవచ్చు. ''మీరు నా మీద ఎదురుదాడి ప్రారంభించలేదు కదా!'' అనుమానంగా అడిగింది శ్రీహిత.

''ఎదురు దాడా! అంటే?'' అర్థం అయినా కానట్లుగా అడిగాడు శేఖర్.

''అదే.. ఈమధ్య క్రికెట్‌లో భారత్ ఓడిపోయిందని నేను బాధపడి.. మిమ్మల్ని బాధపెట్టినందుకు ప్రతిగా..'' ఆగిపోయింది శ్రీహిత వాక్యం పూర్తి చేయకుండానే.

అంతే.. అప్పటివరకూ విషాదంగా ఉన్న శేఖర్ మోముపై చిర్నవ్వు మొలిచింది. శ్రీహిత చేయి పట్టి తన సరసన కూర్చుండబెట్టుకున్నాడు.

''హమ్మయ్య... త్వరగానే అర్థం చేసుకున్నావ్. వెరీగుడ్.. తెలివైనదానివే.. ఇన్నాళ్లకి నా బాధ నీకర్థమైంది'' అన్నాడు శేఖర్ రిలీఫ్‌గా.

''నేను మిమ్మల్ని బాధపెడ్తున్నానన్న సంగతి నాకు తెలుసు. కానీ ఏం చేయను? నాకు తెలియకుండానే నేను అందులో లీనమైపోతాను. నా ప్రమేయం లేకుండానే నా మనసు రకరకాలుగా స్పందిస్తోందీ విషయంలో. ఈ విషయంలో నేనశక్తురాలిని.'' చెప్పింది శ్రీహిత బాధగా.

''అటువంటప్పుడు నీకు సైకలాజికల్ కౌన్సిలింగ్ అవసరమవుతుంది'' అన్నాడు శేఖర్.

''అంటే.. నన్ను పిచ్చివాళ్లతో జమ కట్టేశారన్న మాట.'' కోపం ప్రకటించింది శ్రీహిత.

''నీ ఆలోచన పొరపాటు.. కేవలం పిచ్చిపట్టిన వారే కౌన్సిలింగ్‌కి వెళ్తారనుకోవడం తప్పు. మనసు మన వశంలో లేకుండా గాడి తప్పి ప్రవర్తిస్తుంటే దాన్ని అదుపులో పెట్టేందుకు మానసిక వైద్యనిపుణుల సహాయం ఎంతైనా అవసరం'' చెప్పాడు శేఖర్ ఆమెను అనునయిస్తూ.

''అవునా!'' సాలోచనగా అడిగింది శ్రీహిత.

''అవును శ్రీలూ... ఆటన్న తరువాత జయాపజయాలు సహజం. ఒకరు గెలిస్తే ఇంకొకరు ఓడటం తథ్యం. దాన్ని స్పోర్టివ్‌గా తీసుకోవడమే అన్ని విధాల ఆరోగ్యదాయకం. ఏ క్రీడాకారుడైనా సరే గెలుపు ఓటములకు సంబంధించిన ఆనందమైనా, విషాదమైనా సరే.. మైదానం లోపలే వదిలేసి బయటపడాలి. పదే పదే వాటి గురించే తలపోస్తూంటే వారికి మతి స్థిమితం తప్పడం ఖాయం. ఓటమికి కృంగిపోయి డీలాపడిపోతే.. ఏ ఆటగాడూ కూడా వారి భార్యలతో సజావుగా సంసారాలు చేయలేరు.

అందరిదాకా ఎందుకు? నువ్వస్తమానం పొడుగుతూ ఉంటావే 'మా హైదరాబాదీ' అని... అతడే వి.వి.ఎస్.లక్ష్మణ్.. అతడి సంగతే తీసుకో. సిరీస్ ఆరంభంలో సెంచరీలతో చెలరేగిపోయి అభిమానులను అలరించిన అతడు.. సిరీస్ చివరలో అంతగా రాణించలేకపోయాడు.

ఆ సిరీస్ ముగిసిన మరికొద్ది రోజులకే అతడి పెళ్లి జరిగింది. అపజయం వలన అతడు పొందిన నిరాశ నుండి బయటపడకపోతే.. అతడు పెళ్లి చేసుకున్న అమ్మాయితో సంతోషంగా గడపగలడా! పదే పదే తన వైఫల్యాన్ని తలుచుకుంటే అతడి సంసార జీవితం సుఖప్రదమౌతుందా! నువ్వే ఆలోచించు.

ఆటల్లో మనకిష్టమైన క్రీడాకారుడు ఓడిపోతే బాధపడ్డం సహజం. కానీ ఆ బాధ ఇలా వ్యక్తిగత జీవితాల్లోకి చొరబడి.. ఆనందాన్ని హరించడం మాత్రం గర్హనీయం. ఇప్పటికైనా నువ్వు ఆత్మవిమర్శ చేసుకుని నిన్ను నవ్వు సరిదిద్దుకోగలిగితే సంతోషం.. లేకపోతే నువ్వు ట్రీట్‌మెంట్‌కి సిద్ధపడవలసి ఉంటుంది.''

శేఖర్ చెప్పింది విన్నాక శ్రీహిత ఆలోచనలో పడింది. అతడు చెప్తున్నదంతా నిజమే. ఇంట్లో కూర్చుని టి.వి.మ్యాచ్ చూసి ఇండియన్ టీమ్ ఓడిపోయిందని తానే ఇంత మథనపడుతూంటే.. ఆట తాలూకు ఫలితాన్ని స్వయంగా అనుభవించిన ఆటగాళ్లు ఇంకెంత బాధపడతారో కదా! మరి వాళ్లు ఆ ప్రభావాన్ని తమ వ్యక్తిగత జీవితంపై పడనివ్వకుండా నెగ్గుకొస్తున్నారంటే... అది సామాన్య విషయం కాదు. వారే వారి ఓటమి గురించి మరచిపోయి హాయిగా గడపగలిగినప్పుడు.. తను అదే తలుచుకుంటూ కూర్చుని మనసు పాడు చేసుకోవడంలో అర్థం లేదు.

''నేను ట్రీట్‌మెంట్‌కి సిద్ధమే.'' కాస్సేపటికి అంది శ్రీహిత చిన్నగా నవ్వి.

''సరే.. రేపే డాక్టర్‌ని కన్‌సల్ట్ చేద్దాం.'' చెప్పాడు శేఖర్ సంతోషంగా.

''బయట డాక్టర్ దగ్గరకెళ్లొద్దు''

''మరి!'' సందేహంగా చూశాడు.

''నా డాక్టర్ మీరే.. నాకు పట్టిన జాడ్యాన్ని మీరే వదిలించగలరు.'' అంది శ్రీహిత భర్తను ఆప్యాయంగా హత్తుకుంటూ.

''పేషెంట్ డాక్టర్‌కి కోపరేట్ చేయాలట.. నువ్వు నాకు సహకరిస్తావా?'' ఆమె పెదవులు అందుకున్నాడు శేఖర్. ''తప్పకుండా'' తమకంతో అతడిని అల్లుకుపోయింది శ్రీహిత.

''కాస్తాగు'' ఆమెని వదిలి, పాంట్ జేబులోంచి చిన్న బాక్స్ బయటకు తీశాడు శేఖర్.

ఆమె చేతిని తన చేతిలోకి తీసుకుని.. ముద్దులొలికే ఆమె చేతి ఉంగరం వేలికి 'ఎస్' అన్న ఆకారంలో పచ్చలు పొదగబడిన ఉంగరాన్ని తొడిగాడు శేఖర్. తన పిచ్చిలో పడి అతడిని నిర్లక్ష్యం చేసినా సరే.. తన పుట్టినరోజుని గుర్తించి తనకు చక్కటి కానుక తెచ్చిన భర్తవైపు ఆర్ద్రమైన కన్నులతో చూసింది శ్రీహిత.

''ఇన్నాళ్లూ మీ మనసుని నా పిచ్చి చేష్టలతో కలత పెట్టాను. నన్ను క్షమించరూ.'' భర్త హృదయంపై తల వాల్చింది శ్రీహిత పశ్చాత్తాపంగా.

''అంత పెద్ద డైలాగులు మన మధ్య అవసరమా.. అవన్నీ ఏం అక్కర్లేదుగానీ ట్రీట్‌మెంట్ మొదలెడదామా!'' కొంటెగా అన్నాడు శేఖర్.

సిగ్గుతో అతడి గుండెల్లో ముఖం దాచుకుంది శ్రీహిత.

అటుపైన.. అంతా సెన్సార్..

ఇద్దరూ సరిసమానంగా ఓడి, గెలిచే క్రీడ మొదలైంది. ☆

